క్లుప్తంగా

బీజేపీ జిల్లా కార్యదర్శిగా అశోక్



నియామక పత్రం అందుకుంటున్న అశోక్

శివ్వంపేట(నర్సాపూర్): బీజేపీ జిల్లా కార్యదర్శిగా మండల పరిధి ఉసిరికపల్లి గ్రామానికి చెందిన అశోక్ సాదుల నియమితులైయ్యారు. సంబంధించి నియామకం పత్రం శనివారం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎంపీ రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీఏసీఎస్ సిబ్బందిపై ఆగ్రహం



యూరియా కోసం క్యూకట్టిన రైతులు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలం సూరారం పీఏసీఎస్ గోదాం వద్ద రైతులు శనివారం వర్షంలో తడుస్తూ పెద్ద సంఖ్యలో క్యూలైన్‌లో నిల్చున్నారు. దీంతో ఒక్కో రైతుకు ఒక్క బస్తా మాత్రమే ఇవ్వడంతో రైతుల సిబ్బందిపై మండిపడ్డారు. రైతులు పీఏసీఎస్ సిబ్బందితో వాగ్వవాదానికి దిగారు. దీంతో వారు ప్రస్తుతం ఒక్క బస్తా మాత్రమే ఇస్తామని, యూరియా మరో లోడ్ వచ్చిన తరువాత అదనంగా ఇస్తామని సర్దిచెప్పారు.

గిరిజనుల ప్రత్యేక పూజలు



పూజలలో పాల్గొన్న గిరిజనులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి దేవులతండాలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో గిరిజనులు శనివారం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసం శనివారం పురస్కరించుకుని తండాకు చెందిన గిరిజనులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి అభిషేకం, చందన అలంకరణ పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి



వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రోడ్డు నిబంధనలు పాటిస్తే, ప్రమాదాల జరగవని ఎస్‌ఐ నర్సింహులు అన్నారు. శనివారం సిబ్బందితో కలసి మండలంలోని చిట్కుల్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు అతిక్రమించినా, మద్యం సేవించి వాహనాలు నడిపిన, మైనర్లను డ్రైవింగ్ చేసేందుకు ప్రోత్సాహించిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవన్నారు.

మాజీ ఎమ్మెల్యేకి నివాళి

నర్సాపూర్: నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే సీపీఐ నాయకుడు చిలుముల విఠల్‌రెడ్డికి ఆయా పార్టీల నాయకులు శనివారం నివాళులర్పించారు. శనివారం విఠల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, రఘువీరారెడ్డి, సొసైటీ చైర్మన్ రాజుయాదవ్ నివాళులర్పించారు.

అప్రమత్తంగా ఉండండి



చిన్నశంకరంపేట(మెదక్): భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్నశంకరంపేట తహసీల్దార్ మాలతి సూచించారు. శనివారం మండలంలోని ధరిపల్లి–సూరారం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిని పరిశీలించారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా పక్కనుంచి దారిని ఏర్పాటు చేశారు. కొద్దిపాటి వర్షం నీరు వచ్చిన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడనుందని తెలిపారు. పెద్దవర్షం పడితే మాత్రం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే సూరారం, జంగరాయి గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉంటున్న వారు జాగ్రత్త ఉండాలన్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు

- భారీ వర్షాలకు ప్రజల ఇక్కట్లు
- వాగులు వంకలు దాటొద్దని హెచ్చరిక
- పురాతన ఇళ్లలో ఉండొద్దని సూచన



కౌడిపల్లి: అలుగు పారుతున్న చెరువు



తూప్రాన్: కిష్టాపూర్ చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలంలో కురుస్తున్న వర్షాలకు కుంటలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. అల్లాదుర్గం గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై నుంచి మోకాలు లోతు నీళ్లు పారాయి. బట్టికుంట చెరువు నిండి ఆలుగుపారింది. స్థానిక పటేల్‌చెరువులోకి కాల్వ ద్వారా వరద పెద్ద ఎత్తున చేరింది. పటేల్ చెరువులోకి నీరు చేరుతుండటంతో రెండు పంటలు పండుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లు పాక్షిక ధ్వంసం

కౌడిపల్లి(నర్సాపూర్): మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని తునికి, వెంకట్రావ్‌పేట, పీర్లతండా, కౌడిపల్లి గ్రామాల్లో ఆరు ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. తునికిలో ఇళ్లకూలిన బాధితురాలి ఇంటికి తహసీల్దార్ క్రిష్ణ, ఆర్ఐ శ్రీహరి వెళ్లి పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామన్నారు. తునికి కలీల్‌సాగర్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. వర్షాలవల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పాత ఇళ్లలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఫైజాబాద్ చెరువు పరిశీలన

చిలప్‌చెడ్(నర్సాపూర్): భారీ వర్షాలకు పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు జలమయమయ్యాయి. మండలంలోని ఫైజాబాద్‌లోని పెద్ద చెరువు తూము వద్ద, నీరు లీకేజీ అవ్వడంతో శనివారం తహసీల్దార్ సహదేవ్, ఎస్ఐ నర్సింహులు, ఇరిగేషన్ ఏఈ హరీష్‌రెడ్డిలు పరిస్థితిని పరిశీలించారు. అనంతరం నీటి లీకేజీని ఆపేందుకు తాత్కలికంగా మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సహదేవ్ మట్లాడుతూ చెరువు కట్టలు, చెరువు అంచుల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ సంబంధిత సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎస్ఐ నర్సింహులు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిండిన చెరువులు, వాగులు వద్దకు పిల్లలు వెళ్లకుండా చూడలన్నారు. చాముండేశ్వరి ఆలయ ఆవరణలో మంజీరా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో, అటు వైపు వెళ్లకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పాల్గొన్నారు.

మత్తడిపోస్తున్న వెంకటాపూర్(ఆర్)చెరువు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్) చెరువు శనివారం అలుగు పారుతుంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్టవద్ద కొద్దిగా కృంగడంతో గ్రామస్తులు కట్టపై ట్రాక్టర్లతో మట్టివేసి మరమ్మతులు చేశారు.

93.8 ఎం.ఎం వర్షపాతం నమోదు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు 93.8 ఎం.ఎంల వర్షం కురిసింది. ఈ వర్షాల వల్ల చెరువులు, కుంటలలో నీరు చేరింది.

కురిసిన వర్షాలకు నిండిన చెరువులు

మనోహరాబాద్(తూప్రాన్): వర్షాలకు పలు గ్రామాల్లో చెరువులు నిండుకుండలా నిండాయి. మండలంలోని పోతారం, రామాయపల్లి, రంగాయపల్లి చెరువులు అలుగుపారుతున్నాయి. పలుగ్రామాల్లోని పురాతన ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

మోతుకు కుంటకు గండి

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఖాజీపేట మోతుకు కుంటకు రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శనివారం గండిపడింది. దీంతో ఆయకట్టు కింద ఉన్న వరి పంట నీట మునిగింది. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న పంట నీట మునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మోతుకు కుంట ఆయకట్టు కింద సుమారు 30ఎకరాలలో రైతులు వరి పంట సాగు చేస్తున్నారు. సాయంత్రం విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్‌లు ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి మోతుకుంటను పరిశీలించి, గండికి మరమ్మతులు చేయించే పనులను దగ్గరుండి చేయించారు.

చెక్ డ్యాంను పరిశీలన

తూప్రాన్: కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కిష్టాపూర్ గ్రామ సమీపంలోని చెక్ డ్యాం పొంగిపొర్లుతోంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా ఆర్డీఓ జయచంద్రారెడ్డి శనివారం పర్యవేక్షించారు. రానున్న రోజుల్లో అతిభారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్, పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజలకు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

127.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట మండలంలో 127.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. మండలంలోని పలు చెక్‌డ్యాంలు, ఎదుల్లాపూర్ సింగయ్య చెరువు, చండీలోని చామన్ చెరువులు నిండి అలుగు పారుతున్నాయి.



మోతుకుకుంటకు గండిపడి వృథా పోతున్న నీరు



శివ్వంపేటలో పారుతున్న చండీచామన్ చెరువు



ఎదుల్లాపూర్ చెరువు నిండి పారుతున్న అలుగు



అల్లాదుర్గం: ప్రధాన రహదారిపై పారుతున్న నీరు



చిలప్‌చెడ్(నర్సాపూర్): జాబాద్ పెద్ద చెరువును పరిశీలిస్తున్న అధికారులు



మనోహరాబాద్(తూప్రాన్): అలుగు పారుతున్న పోతారం చెరువు



కౌడిపల్లి: తునికిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ క్రిష్ణ, ఆర్ఐ శ్రీహరి

సేంద్రియ సాగుతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు సేంద్రియ సాగు చేపట్టాలని వ్యవసాయ విద్యార్థినులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామంలో మల్లారెడ్డి యూనివర్సిటీ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు వాడకం జీవామృతం, పంచగవ్య, వరి పంటలకు సోకే చీడ పురుగులు, వాటి లక్షణాలు నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం పూర్తిస్థాయిలో తగ్గిస్తే పెట్టుబడి ఖర్చులు సైతం తగ్గిపోతాయని అందుకు రైతులు ముందుకు రావాల్సిన అవసరం ఉందని విద్యార్థినులు దివ్య, లహరి, హరిక, మధు, కవిత అన్నారు.

అంతారంలో ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరంలో వైద్యులు, వాలంటీర్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామీణ ప్రజలకు హోమియోపతి వైద్యంపై అవగాహన కల్పించేందుకు మాస్టర్ ఇ,కె ఆధ్యాత్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో మండల పరిధి అంతారంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించామని ఆ సంస్థ వాలంటీర్లు అన్నారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనంతరం వాలంటీర్లు మాట్లాడుతూ.. శిబిరానికి వచ్చిన రోగులను పరిశీలించిన వైద్యులు వారికి నెలకు సరిపడా ఉచిత మందులు అందజేశారు. జాగ్రత్తలు, తినకూడని ఆహార పదార్థాల గురించి వివరించారు. ప్రతి రెండవ శనివారం నర్సాపూర్‌కు వచ్చి, ఉచితంగా వైద్యం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభర గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు పాఠశాలు, ఆలయాలు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లోని కూడళ్ల వద్ద ఉట్టి కొట్టి సంతోషంగా గడిపారు. చిన్నారులు గోపిక, చిన్నికృష్ణుడి వేషధారణలో అలరించారు. పలు గ్రామాల్లో శోభాయాత్రలు నిర్వహించారు. ఆలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించి భక్తులు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.



రేగోడ్(మెదక్): కృష్ణుడి వేశాధారణలో బాలుడు



చిన్నశంకరంపేట: శ్రీకృష్ణుడి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న నాయకులు



అల్లాదుర్గం: ముప్పారం అంగన్‌వాడీలో..



పాపన్నపేట(మెదక్): నార్సింగి శ్రీసాయి స్కూల్‌లో..



కౌడిపల్లి: వెంకటాపూర్(బి)లో..



రామాయంపేటలో..

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి



సమావేశంలో మాట్లాతున్న సిద్ధేశ్వర్

మెదక్‌జోన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్(ఆర్‌జీపీఆర్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధేశ్వర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతం కావాలంటే గ్రామాల్లో రాజీవ్ పంచాయతీరాజ్ సంఘటన్ ద్వారా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యల్ని తెలుసుకోవాలన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీలో ప్రాధాన్యం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అంజాగౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరుశురాంగౌడ్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, టీపీసీసీ నేత సుప్రభాతరావు, జిల్లా నేతలు ప్రభాకర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి పంటల్లో నీరు నిలిచే అవకాశాలు ఉన్నాయని, రైతులు సరైన జాగ్ర త్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ఫైజాబాద్, చండూర్ గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పంటల్లో నీరు నిలిచిస్తే .. నీటిని బయటకు పంపేందుకు మురుగుకాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎరువుల వాడకం, పురుగుమందుల పిచికారీ తాత్కలికంగా నిలిపివేయాలన్నారు. ఇప్పటివరకు నాటు వేయని రైతులు, వర్షాలు తగ్గిన వెంటనే నాటు వేసుకోవాలన్నారు. వరి పంట చెడిపోతే, త్వరగా కోలుకోవడానికి 19:19:19 ద్రావణాన్ని, 5 ఎంఎల్ లీట ర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పత్తిలో వడతెగులు అశించే అవకాశం ఉందని, దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు, లీటర్ నీటిలో కలిపి , మొక్కల మొదళ్లలో తడిచేలా వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. పంట త్వరగా కోలుకోవడానికి మల్టీ-కే 10 గ్రాములు, లేదా నానో యూరియా 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు గోపాల్ రావు, రాజు, రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నర్సాపూర్‌రూరల్: మండలంలోని చిప్పల్ తుర్తిలోని సద్గురు దామ్ ఆశ్రమంలో కొనసాగుతున్న హవన్ పూజా బ్రహ్మదీక్ష కార్యక్రమంలో శనివారం నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిద్దియోగి, శ్రీకృష్ణనంద, జి మహారాజుతో ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ కబీర్ సేన ప్రెసిడెంట్ చత్రునాయక్, లక్ష్మణ్‌నాయక్, నర్సాపూర్ పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, శ్రీనివాస్ గుప్తా, లక్ష్మణ్‌గౌడ్, రాహుఫ్ పాల్గొన్నారు.

గ్రామసంఘం ఆదాయం రూ .1.45 లక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి రెండవ గ్రామసంఘం ఆదాయం రూ.1.45లక్షలు వచ్చినట్లు గ్రామసమాఖ్య అధ్యక్షురాలు పూర్ణిమ తెలిపారు. శనివారం గ్రామసంఘం వార్షిక మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండవ సంఘంలో 37గ్రామ సంఘాలు ఉండగా.. 385మంది సభ్యులు ఉన్నారు. సంఘంలో రూ.15.50లక్షలు పొదుపు డబ్బులు ఉండగా సంఘం సభ్యులకు స్వయం ఉపాధి ఆర్థిక చేయూతకు అప్పు ఇచ్చినట్లు చెప్పారు. 2024–25 సంవత్సరానికి గ్రామ సంఘానికి రూ. 1.45,218 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వీఓఏ ఏయే, అంగన్‌వాడీ టీచర్లు కమల, నిర్మల, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షురాలు పూర్ణిమ

పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

ఆర్డీఓ రమాదేవి



ఎలకుర్తి శివారులో గుండువాగును పరిశీలిస్తున్న ఆర్డీఓ

టేక్మాల్(మెదక్): కురుస్తున్న భారీ వర్షాలకు నీటి ప్రవాహం ఉధృతంగా కొనసాగుతుంది. మంజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మెదక్ ఆర్డిఓ రమాదేవి తెలిపారు. శనివారం టేక్మాల్ మండలంలోని ఎలకుర్తి గ్రామ శివారులో పారుతున్న గుండువాగును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు కురుస్తున్న వర్షాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుండువాగుతో పాటు చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయని అటు వైపు ఎవరూ వెళ్లొద్దని సూచించారు. అధిక వార్షాల కారణంగా సింగూరు నీటిని వదిలారని మంజీరా నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విద్యుత్ స్తంభాల వద్ద, కూలిపోయిన ఇళ్ల వంటి ప్రదేశాలలో ఉండొద్దన్నారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోకుండా ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని వివరించారు. అత్యవసర సమయాల్లో అధికారులను సంప్రదించి వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎలకుర్తి నుంచి జోగిపేటకు గుండువాగుపై నుంచి వెళ్లే రోడ్డు బ్రిడ్జిని నూతనంగా నిర్మించాలని స్థానికులు ఆర్డీఓను కోరారు. అంతకుముందు తహసీల్దార్ తులసిరాం, టేక్మాల్ ఈఓ రాకేష్ గుండువాగును పరిశీలించి రోడ్డు భారీకేడ్లను ఏర్పాటు చేశారు.

పత్తిలో నీరు నిల్వ లేకుండా చూడాలి

వ్యవసాయాధికారి రాంప్రసాద్



బొడ్మట్‌పల్లిలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ రాంప్రసాద్

టేక్మాల్(మెదక్): అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి, వరి పంటల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని మండల వ్యవసాయాధికారి రాంప్రసాద్ తెలిపారు. మండలంలోని బొడ్మట్‌పల్లి, కాదులూరు గ్రామాల్లో పత్తి, వరి పంటలను శనివారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలకు పంటల్లో నీరు నిల్వకుండా జాగ్రత్త పడాలన్నారు. పొలం ఒడ్డు వెంబడి కాల్వవలు తీస్తూ నీటిని బయటకు పంపించాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత పత్తి నీటి ముంపునకు గురైనా పంటకు త్వరగా కోలుకోవడానికి 5 శాతం యూరియా స్ప్రే చేస్తూ 19-19-19, 13-0-45 రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. పంట త్వరగా కోలుకోవాలంటే 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలన్నారు.